బుక్ ఫెయిర్‌ను లో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, 'మన దేశం మన రాజ్యాంగం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి

పుస్తక పఠనం వల్లే.. సమాజోద్ధరణ

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

చిక్కడపల్లి, డిసెంబర్ 28: మానవ నాగరికత ఉన్నన్ని రోజులు పుస్తక ప్రస్థానం ఉంటుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఇందిరా పార్క్ సమీపంలోని కళా భారతి ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ కొనసాగుతుంది. బుక్ ఫెయిర్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు పుస్తకాలు చదవాలన్నారు. ఈ బుక్స్, ఆడియో బుక్స్ చదవడం కన్నా ప్రింటెండ్ పుస్తకాలు చదవడం మంచి అలవాటు అని అన్నారు. పుస్తకం చేతిలో పట్టుకుంటే నేరుగా రచయితే విషయం చెబుతున్న అనుభూతి కలుగుతుందన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా మంచి సమాజం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బుక్ ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన బుక్ డోనేషన్ బాక్స్‌ను గవర్నర్ ప్రారంభించారు. బుక్ ఫెయిర్ అధ్యక్షుడు, కవి యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, బుక్ ఫెయిర్ ప్రధాన కార్యదర్శులు ఆర్.వాసు, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి సురేశ్, శోభన్ బాబు, సూరి బాబు, నారాయణ రెడ్డి, ఈసీ కుమార్ పాల్గొన్నారు.

'మనదేశం మన రాజ్యాంగం' పుస్తకం ఆవిష్కరణ

కత్తి పద్మారావు రాసిన 'మన దేశం.. మన రాజ్యాంగం' పుస్తకాన్ని అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది ప్రతి ఒక్కరు చదవాల్సిన పుస్తకం అని అన్నారు. మత గ్రంథాలన్నింటి కన్నా రాజ్యాంగమే ఈ దేశానికి అవసరమైన గ్రంథం అని పేర్కొన్నారు. ఇది బాబా సాహెబ్ అంబేద్కర్‌కి ఇచ్చిన గొప్ప నివాళి ఈ పుస్తకం అన్నారు.

నగర అభివృద్ధిలో హెచ్ఎండీపీదే కీలక పాత్ర

హెచ్ఎండీపీ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ అభివృద్ధిలో హెచ్ఎండీపీ కీలక పాత్ర పోషించనుందని, రీజనల్ రింగు రోడ్డు విస్తరించి ఉన్న ప్రాంతాల వరకు హెచ్ఎండీపీ పరిధిని పెంచే యోచన ప్రభుత్వానికి ఉందని, అందుకు అనుగుణంగానే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లుగా హెచ్ఎండీపీ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. సిటీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడమే లక్ష్యంగా, ప్లాన్డ్ సిటీ నిర్మాణానికి హెచ్ఎండీపీ కట్టుబడి ఉందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తూనే, హైదరాబాద్ అవసరాలకు తగినట్లుగా ప్రణాళికబద్ధమైన నగరాభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. నార్త్ సిటీకి ఎంతో కీలకమైన డబుల్ డెక్కర్ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని, ప్రస్తుతం ప్రణాళిక దశలో ఆ ప్రాజెక్టు ఉందనీ, వరల్డ్ క్లాస్ మౌలిక వసతుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మెట్రోపాలిటన కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ స్పష్టం చేశారు.

ఇమేజ్‌ను పరిరక్షించేందుకు..

ర్యాపిడ్ గ్రోత్‌తో దూసుకుపోయే హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్‌ను పరిరక్షించేందుకు హెచ్ఎండీపీ సంసిద్ధంగా ఉందన్నారు. ఈ క్రమంలో పటిష్టమైన పట్టణ ప్రణాళిక, రోడ్ల విస్తరణ, అర్బన్ ఫారెస్ట్రీ విషయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లుగా తెలిపారు. నిర్మాణ రంగానికి కీలకమైన అనుమతుల ప్రక్రియ కూడా గాడిలో పడిందన్నారు. ప్రాధాన్యతల వారీగా పెం డింగ్ పనులను పూర్తి చేస్తామని, వరల్డ్ క్లాస్ మెట్రో అభివృద్ధిలో కీలక శాటిలైట్ టౌన్‌షిప్‌లకు అవసరమైన ప్రణాళికలు రెడీగా ఉన్నాయన్నారు.

హెచ్ఎండీపీ విస్తరణతో.. ఏకరీతి అభివృద్ధి

హెచ్ఎండీపీ పరిధిని పెంచడం వలన ఏకరీతిలో పట్టణాభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే రీజనల్ రింగు రోడ్డు వరకు హెచ్ఎండీపీ పరిధిని పెంచితే మెరుగైన మౌలిక వసతులను అందుబాటులోకి వస్తాయన్నారు. మరో ఏడాదిన్నర కాలం పట్టే మాస్టర్ ప్లాన్-2050తో నగరం నలు దిశలా అభివృద్ధి చెందుతుందన్నారు. అదే విధంగా చెరువులకు హద్దుల నిర్ధారణ ప్రక్రియను వేగంగా నిర్వహిస్తున్నామని, గడిచిన ఐదు నెల్లోనూ 700లకు పైగా చెరువులకు తుది నోటిఫికేషన్ జారీ చేసినట్లుగా తెలిపారు. అయితే, ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసిన, ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసేందుకు కొన్ని సంక్లిష్టమైన అంశాలు ఉన్నాయని, రెవెన్యూ, ఇరిగేషన్ సమాచారంతో పాటు, సర్వే నంబర్ల వారీగా చెరువుల హద్దులను నిర్ధారించాల్సి ఉండటంతో కొంత నెమ్మదిగా సాగుతుందన్నారు.

సీఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్

సిటీబ్యూరో, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థి రిషబ్ ఓత్సవాల్ ఆర్ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారని మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల అడ్మిన్ అడ్వైజరీ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారు ప్రకటించిన ఫలితాల్లో రిషబ్‌తో పాటు మొదటి 50 ర్యాంకుల్లో నాలుగు ర్యాంకులు 33,34,40 ర్యాంకులను మాస్టర్ మైండ్స్ విద్యార్థులే సాధించారని ఆయన తెలిపారు. రిషబ్ ఇంటర్మీడియట్ ఎంఈసీ నుంచి మాస్టర్ మైండ్స్‌లోనే చదువుతున్నారని, వివిధ కామర్స్ కోర్సుల్లో మాస్టర్ మైండ్స్‌కు ఇప్పటివరకు 50 సార్లకు పైగా ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని, ఈ ర్యాంకుల క్రెడిట్ పూర్తిగా విద్యార్థులకే దక్కుతుందని మోహన్ పేర్కొన్నారు.

జర్నలిస్టుల కోసం నిమ్స్‌లో మీడియా పాయింట్

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, డిసెంబర్ 28: నిమ్స్‌లో సమాచార సేకరణ కోసం వెళ్లే జర్నలిస్టులకు సెక్యూరిటీ గార్డులు, ఇతర సిబ్బంది ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం వైద్యులు ఇంటర్వ్యూలు, దవాఖానలో విజయవంతమైన ఆపరేషన్లు, వివిధ వైద్య విభాగాలకు సంబంధించిన అవగాహన సదస్సులు, ఇతర కార్యక్రమాలకు హాజరయ్యే జర్నలిస్టులు పార్కింగ్‌తో పాటు పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనిపై పలుమార్లు డైరెక్టర్‌కు అనేక ఫిర్యాదులు సైతం అందాయి. ఎట్టకేలకు జర్నలిస్టుల కోసం నిమ్స్ దవాఖానలో మీడియా పాయింట్ ఏర్పాటు చేస్తామని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. పార్కింగ్‌కు సైతం అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. కవరేజీకి వచ్చే జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించేందుకు నోడల్ అధికారి, కో ఆర్డినేటర్లు పనిచేస్తారని తెలిపారు.

మరిన్ని చోట్ల భూగర్భ సంపులు

ఇప్పటికే 23 చోట్ల పనులు

సిటీబ్యూరో, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వరద నివారణ చర్యలను జీహెచ్ఎంసీ వేగవంతం చేసింది. 141 చోట్ల వాటర్ లాగింగ్ పాయింట్స్‌ను గుర్తించిన అధికారులు వాటిని వచ్చే ఏడాది వర్షాకాలం నాటికల్లా 50 చోట్లకు తీసుకురావాలన్న లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే వరద నీరు రహదారులపై నిలవకుండా శాశ్వత పరిష్కారంగా వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లకు శ్రీకారం చుట్టారు. తొలి విడతగా 18 ప్రాంతాలలో 23 వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లను చేపట్టారు. లక్ష నుంచి 10 లక్షల సామర్థ్యంతో ఈ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ (భూగర్భ సంపులు) పనులు చేపట్టగా, ఇప్పటి వరకు రాజ్‌భవన్, సచివాలయం వద్ద అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎర్రమంజిల్ వద్ద చేపట్టిన నిర్మాణం పూర్తి చేశారు. మిగిలిన పనులు తుది దశకు చేర్చారు. ఈ నిర్మాణాలతో నీరు నిలవకుండా ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నారు.

ఫార్మా సిటీలోని ఇండ్ల స్థలాలను అమ్ముకోవొద్దు

ఎకరానికి 121 గజాలను కేటాయించిన, మాజీ సీఎం కేసీఆర్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బేగరి కంచెలోని ప్లాట్లను పరిశీలిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, డిసెంబర్ 28 : బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం హయాంలో ఫార్మా సిటీలో భూములు కోల్పోయిన రైతులకు అన్యాయం జరుగకుండా ముందు చూపుతో ఎకరానికి (గుంట) 121 గజాలను కేటాయించామని, ఇండ్ల స్థలాలను అమ్ముకోవొద్దని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్లు దూరదృష్టితో రైతులకు ఇంటి స్థలాలను ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో భూములు కోల్పోయిన రైతులకు బేగర కంచెలోని కేటాయించిన ఇండ్ల స్థలాలను శనివారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పాలనపై కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఫార్మా సిటీ ఏర్పాటు కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం 14 వేల ఎకరాలకు పైగా రైతులను ఒప్పించి, మెప్పించి భూములను సేకరించినట్లు చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు అన్యాయం జరుగకుండా ఎకరాకు 121 గజాలలు ఇచ్చి హెచ్ఎండీఏ లేహౌట్ చేసి రైతులకు అప్పగించినట్లు తెలిపారు. రైతులు రోడ్డున పడకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఐదేండ్ల అనంతరం, అమ్ముకునే హక్కును కల్పించినట్లు తెలిపారు. కానీ, కొంత మంది అమయాక రైతులను మోసం చేసి ప్లాట్లను తక్కువ ధరకు రియల్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, వారి మోజులో పడవ్దని కోరారు. భవిష్యత్‌లో మంచి ధరలు వస్తాయని తెలిపారు. రైతులు ఎవరు ఇంటి స్థలాలను అమ్ముకోవొద్దని కోరారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, వర్కింట్ ప్రసిడెంట్ ఎలుక మేఘనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్, గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రవీణ్ నాయక్, కాకి రాములు ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు తాండ్ర దేవేందర్, బుడ్డి లత్తత నరేందర్ గౌడ్, జంగయ్య, రాములు, డైరెక్టరు పొట్టి ఆనంద్, యూత్ నాయకులు బొక్క దీక్షిత్‌రెడ్డి, సురుసాని కొండల్ రెడ్డి, ఎగ్గిడి గణేశ్, భీమ్ నాయక్, మహిపాల్, తిరుపతయ్య, క్రిష్ణ, ఢిల్లీ గణేశ్‌లు ఉన్నారు.

రాజ్యాధికారమే బీసీల లక్ష్యం కావాలి

మేధోమథన సదస్సులో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు, చిత్రంలో తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 28: జెండా, అజెండా ఒక్కటే ఉండాలని, రాజ్యాధికారమే బీసీల లక్ష్యం కావాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్, జాతీయ సామాజిక న్యాయవేదిక సమన్వయకర్త డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. జాతీయ సామాజిక న్యాయ వేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ''75 ఏండ్లుగా రాజ్యాంగం అమలు, అనంతరం కూడా రాజకీయ అంటరానితనంలోనే బీసీలు'' అనే అంశంపై జరిగిన మేధోమథనం సదస్సులో డాక్టర్ కృష్ణ మోహన్‌రావు మాట్లాడుతూ, 75 ఏండ్లుగా దేశంలో రాజ్యాంగం అమలుల్లో ఉన్నా బీసీలు రాజకీయ అంటరాని తనానికి గురవుతూనే ఉన్నారన్నారు. ప్రస్తుతం, దేశంలో బీసీ జనాభా 75 కోట్లు ఉండగా, 4,800 కులాలు ఉన్నాయని, కానీ, చట్ట సభల్లోకి వెళ్లని వారు 3,800 పైగానే ఉన్నారని, కనీసం వార్డు సభ్యుడు కాలేని స్థితి ఉందన్నారు. అధికార పార్టీలు కనీసం నామినేట్ పదవులను ఇవ్వడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, కులగణన చేసి, 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకోవాలన్నారు. వంద శాతం కులగణన చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం పూర్తి స్థాయిలో లెక్కింపులు చేసినట్లు కనిపించడం లేదని, నేటికీ అనేక మంది తమ ఇంటికి కులగణన సర్వే కోసం రాలేదని చెబుతున్నారన్నారు. ఇలాంటి క్రమంలో బీసీలకు ఎలాంటి న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చట్టసభతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలన్నారు. దేశంలోని బీసీలు రాజకీయ పార్టీలు పెట్టుకొని రాజ్యాధికారాన్ని ఏలుతుందని, ఎంతో చైతన్యం కలిగిన తెలంగాణ రాష్ట్రంలో బీసీలు రాజకీయ పార్టీ పెట్టుకొని తమ ఆకాంక్షలను సుసాధ్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి విస్మరిస్తే బీసీల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చే జనాభా గణనలో బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. ఇక దేహీ అనే యోచన లేదని, తమ హక్కులను పోరాడి సాధించుకుంటామన్నారు. ఇక ఏ రాజకీయ పార్టీలపై ఆధార పడాల్సిన అవసరం లేదని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీసీలను నిలబెట్టుకొని వారినే గెలిపించుకోవాలన్నారు. అందుకు ఐక్యంగా ముందుకు సాగాలని, గ్రామీణ స్థాయి నుంచి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్ మాట్లాడుతూ రాజ్యాంగం అమలైన తర్వాత అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించాల్సి ఉందని, కానీ, బీసీలను మాత్రం వెనుకబాటుకు గురిచేశారన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, బీసీ సంఘం నాయకులు దేవళ్ల సమ్మయ్య, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, ప్రొఫెసర్ నరేంద్ర బాబు, ప్రొఫెసర్ పార్థసారథి, డాక్టర్ ఎస్. పృథ్వీరాజ్, ప్రొఫెసర్ భాస్కర్, ప్రొఫెసర్ భాగయ్య, డాక్టర్ కోరే రాజ్ కుమార్, డాక్టర్ అంకం, దుండ్ర కుమారస్వామి, పాల్వాయి శ్రీనివాస్, గుజ్జ రమేశ్, పులిపాటి శ్రీనివాస్, మేరు భాస్కర్ రావు, ప్రొఫెసర్ కవిత, ప్రొపెసర్ రమాదేవి, రాచమల్ల బాలకిషన్, నర్మద, కల్యాణ్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్య సామాజిక ప్రగతికి దోహదం

తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఫైర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీరాం వెంకటేశ్

స్టాన్లీ కళాశాలలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

విదేశీ ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్‌లతో స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక తదితరులు

అబిడ్స్, డిసెంబర్ 28: ఇంజనీరింగ్ విద్య సామాజిక ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఫైర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీరాం వెంకటేశ్ పేర్కొన్నారు. అబిడ్స్ చాపెల్ రోడ్‌లోని స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని కళాశాలలో రెండు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న విషయం తెలిసిందే. రీసెర్చ్ ఇంటల్లీజెంట్ కంప్యూటింగ్ ఇన్ ఇంజనీరింగ్ (RICE-2024) పై నిర్వహించిన తొమ్మిదో అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఇందుకు తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఫైర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీరాం వెంకటేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ హైదరాబాద్, యూనివర్సిటీ ఆఫ్ డాన్ బాస్కో ఎల్ సాల్వడార్లు సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు డాక్టర్ విజయేందర్ కుమార్ సోలంకి అధ్యక్షత వహించగా, శ్రీరామ్ వెంకటేశ్ మాట్లాడుతూ కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ తదితర విభాగాలలో కృత్రిమ మేధ నేడు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా కృత్రిమ మేధను అభివృద్ధి చేయడానికి అన్ని రంగాలలో చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఒక్కో విభాగానికి ఒక్కో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కృత్రిమ మేధ అనేది అన్ని విభాగాలను కలిపి కొత్త ప్రయోజనాలను చేకూర్చే విధంగా ఉంటుందని చెప్పారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశోధనలలో నాణ్యతకు పెద్ద పీట వేయాలని రీసెర్చ్ స్కాలర్లను కోరారు. ఇంజనీరింగ్‌లో పరిశోధనలను కళాశాలలు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శించిన పరిశోధన పత్రాలలోఉత్తమమైన పరిశోధనా పత్రాలకు కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.కృష్ణారావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.కృష్ణారావు, డైరెక్టర్‌లు టి.రాకేశ్ రెడ్డి, ఆర్.ప్రదీప్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణమూర్తి, అకడమిక్స్ డీన్ డాక్టర్ ఎ.వినయ్‌బాబు, డైరెక్టర్ వి.అనూరాధ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ.రమేశ్, కన్వీనింగ్ టీమ్ డాక్టర్ ఎం.స్వప్న, డాక్టర్ శివాని యాదవ్, డాక్టర్ జి.కార్తీక్, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎంపీ ఆర్.కృష్ణయ్య సంఘీభావం

అబిడ్స్, డిసెంబర్ 28: తెలంగాణ విద్యాశాఖలో సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గన్‌ఫౌండ్రిలోని డీఈఓ కార్యాలయంలో గత 19 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించి వారికి మద్దతు తెలిపారు. అనంతరం, ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ సమగ్ర శిక్షలో ఇరవై ఏండ్లుగా వివిధ విభాగాలలో టీచింగ్, నాన్ టీచింగ్‌లలో విధులు నిర్వహిస్తూ చాలీ చాలని జీతాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వారి ఉద్యోగాలను వెంటనే రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు పే స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే వారిని పిలిపించి వారితో చర్చలు జరిపి తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కౌడె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐ.సరిత, కోశాధికారి శ్రీవాణిలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ఆందోళనను తీవ్రతరం చేస్తామమన్నారు. ప్రతి ఉద్యోగికి 20 లక్షల జీవిత బీమా, పది లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మచ్చ బొల్లారం మోదుగుల కుంట వద్ద చెత్తను పరిశీలించి అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి.. చెత్త తొలగింపులో అల్వాల్ సర్కిల్ విఫలం

మల్కాజిగిరి, డిసెంబర్ 28: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మచ్చ బొల్లారంలోని మోతుకుల కుంట సమీపంలో శ్మశాన వాటిక స్థలాన్ని డంపింగ్ యార్డుగా మార్చిన స్థలాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మోదుగుల కుంట సర్వే నం.198, 199లలో హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని అల్వాల్ మున్సిపల్ అధికారులు డంప్ యార్డ్‌గా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చుట్టు పక్కలో దాదాపు 50 కాలనీల ప్రజలు ఆనారోగ్యం పాలై దవాఖానల పాలవుతున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు. శ్మశాన వాటికను డంపింగ్ యార్డుగా మార్చి హిందువుల మనోభావాలను దెబ్బ దీస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ప్రతి రోజు ఇక్కడ నుంచి చెత్తను తొలగించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించకుంటే సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేశ్, శోభన్ బాబు, మల్లేశ్ గౌడ్, యాదగిరి గౌడ్, ప్రశాంత్, సరేశ్, జావేద్ పాల్గొన్నారు.



పీజేఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని, మాజీ ఎమ్మెల్యే విష్ణు వర్ధన్ రెడ్డి, తదితరులు

పేదల పక్షపాతి, గొప్ప నాయకుడు పీజేఆర్

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సిటీబ్యూరో, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): నిరంతరం పేద ప్రజల కోసం పోరాడుతూ పేదల పక్షపాతిగా నిలిచిన గొప్ప నాయకుడు పి.జనార్ధన్ రెడ్డి అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పీజేఆర్ 17వ వర్ధంతి సందర్భంగా దోమలగూడలోని ఆయన కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి నివాసంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై పీజేఆర్ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. కార్మికుల సమస్యలు, హక్కులకై ఎంతో పోరాడారని తలసాని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ, హైదరాబాద్ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై కూడా నాటి పాలకులపై పోరాడారని తెలిపారు. అక్రమంగా పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాల తరలింపు, హైదరాబాద్ నగర ప్రజల తాగునీటికి నాటి పాలనపై, ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని పేర్కొన్నారు. పీజేఆర్ సేవల కారణంగానే ప్రజల గుండెల్లో ఉండిపోయారని చెప్పారు. తలసానితో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దానోజు శ్రవణ్, సోహైల్, కార్పొరేటర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాస్టర్స్ అథ్లెట్ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొండా విజయ్ కుమార్‌లు

జనవరి 4, 5 తేదీల్లో మాస్టర్స్ క్రీడా పోటీలు

శేరి లింగంపల్లి, డిసెంబర్ 28: గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ అధ్వర్యంలో రాష్ట్ర మాస్టర్స్ క్రీడా పోటీలు జనవరి 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు మాస్టర్స్ అథ్లెట్ అధ్యక్షుడ